నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
ఆదివారం | 26 జనవరి 2025 | పేజీలు 8

# ఎస్సీ వర్గీకరణ అన్యాయం

- వర్గీకరణ కోసం ఏపిలో మిశ్రా కమిటీ వేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం
- వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తున్నాం
- రాయలసీమ కరవు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది
- సంగమేశ్వరం వద్ద తీగల వంతెన కాదు.. రిజర్వాయర్ కట్టాలి
- సమాజాన్ని వీడని అంటరానితనం
- వరదనీటిలో మునిగే చోట రాజధాని నిర్మాణం
- కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ నేత చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు చింతామోహన్ స్పష్టం చేశారు. వర్గీకరణ కోసం ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా ప్రభుత్వం మిశ్రా కమిటీని ఏర్పాటు చేయడాన్ని అంగీకరించమని ఆయన చెప్పారు.

మిగతా 2లో

## భూములిచ్చిన రైతులకు

# మొండిచేయి

- రైల్వే కోచ్ రిహాబిలిటేషన్ ఫ్యాక్టరీకి స్థలాలిచ్చిన రైతులకు అందని పరిహారం
- హైకోర్టు చెప్పినా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ తప్పని ప్రదక్షిణలు
- ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు న్యాయవాదులు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు నగరానికి సమీపంలోని పంచలింగాల, ఇ.తాండ్రపాడు వద్ద కేంద్ర రైల్వే శాఖ నిర్మించ తలపెట్టిన రైల్వే కోచ్ రిహాబిలిటేషన్ వర్క్ షాప్‌కు అవసరమైన స్థలాన్ని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోంది. ఎకరా 2 కోట్ల రూపాయల విలువ చేసే 119.88 ఎకరాల భూమిని రైతుల నుండి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 6,17, 326 రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది. ఎకరాకు 38,72,000 రూపాయలు ఇవ్వాలంటూ 2018లో 6వ అదనపు జిల్లా కోర్టు తీర్పు చెప్పినా,జిల్లా కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం తన వద్దకు వచ్చిన సమయంలో అందులో సగం రైతులకు ఇచ్చి రావాలంటూ హైకోర్టు ఆదేశించినా న్యాయంఅందని ద్రాక్షలాగానే మిగిలిపోయింది.

మిగతా 2లో

- సాధన కోసం కదులుతున్న కర్నూలు న్యాయవాదులు
- న్యాయం చేయని గత ప్రభుత్వాలు
- కపిలేశ్వరయ్య కన్వీనర్‌గా హైకోర్టు బెంచ్ సాధన సమితి ఏర్పాటు

## కర్నూలులో హైకోర్టు బెంచ్ కల

# నిజమయ్యేనా?

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటైన శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేస్తారని, కర్నూలులో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేస్తారని ఆశించిన రాయలసీమ ప్రజలపై తొలుత అధికారంలోకి వచ్చిన తెదేపా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపాలు నీళ్లు చల్లాయి. 2014లోఅధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా కర్నూలులో ఈ విషయాన్ని చెప్పారు. 2019 ఎన్నికల వరకు కూడా అమలు కాలేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం హైకోర్టు బెంచ్ కాదు ఏకంగా హై కోర్టే కర్నూలులో ఏర్పాటు చేస్తామని,

మిగతా 2లో




- పొలాలపై మూడు రోజులుగా వీడని పొగ మంచు
- పంటలకు వీడని తెగుళ్లు ..
- ఆందోళనలో రైతన్నలు
- బీమా ప్రీమియంను మంజూరు చేయాలని రైతన్నల అభ్యర్థన



పొగ మంచు అధికంగా కురుస్తుండటంతో చలిమంట వేసుకుంటున్న దృశ్యం

## రైతుల గుండెల్లో గుబులు రేపుతున్న

# పొగ మంచు



మినుము పంటను కమ్మేసిన పొగ మంచు

# ప్రైవేటు వాహనానికి ప్రభుత్వ డ్రైవర్లా?

- నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తోన్న డ్రైవర్లు

**కర్నూలు నగరం, మేజర్ న్యూస్ :** కెఎంసిలో ఇష్టారాజ్యం నడుస్తోంది. వాహన సౌకర్యం కల్పించేందుకు కొంత మంది అధికారులు ప్రైవేట్ వాహనాలను ఉపయోగిస్తున్నారు. ప్రైవేట్ వాహనానికి వాహన యజమాని డ్రైవర్‌ను కూడా ఏర్పాటు

మిగతా 2లో




## మురికి కాలువలో

# పసికందు

- కోవెలకుంట్లలో దారుణ ఘటన
- కసాయి తల్లి నిర్వాకం వల్లే..!



మృతి చెందిన శిశువు

సూర్య



కర్నూలులో హైకోర్టు బెంచ్ కల

# నిజ్యమయ్యేనా?

(మొదటి పేజీ తరువాయి)

కర్నూలును న్యాయరాజధానిని చేస్తామని ఇక్కడి ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. ఆ ప్రభుత్వమూ తానిచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయింది. మూడు రాజధానులు అంటూ తాను చేసిన తీర్మానాన్ని తానే రద్దు చేసింది. కోర్టుల ముందు తన వాదనలను గెలిపించుకోలేక పోయింది. 2024లో జరిగిన ఎన్నికల సమయంలో తెదేపా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామంటూ మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది. తెదేపా అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తుండగా, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు విధివిధానాలు రూపొందించేందుకు హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈమారు హైకోర్టు బెంచ్‌ను కర్నూలుకు తెచ్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కర్నూలు జిల్లా న్యాయవాదులు నిర్ణయం తీసుకోవడం విశేషం. ఇందుకోసం హైకోర్టు బెంచ్ సాధన సమితిని న్యాయవాదులు ఏర్పాటు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది కె.కపిలేశ్వరయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తోండగా, సీనియర్ న్యాయవాదులు జయరాజు, మధుసూధనరెడ్డి, దాశెట్టి శ్రీనివాసులను కోకన్వీనర్లుగా ఎంపిక చేసుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుతోపాటు మరో 20 మంది న్యాయవాదులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు చేసేంత వరకు ప్రభుత్వం, హైకోర్టు మధ్య అనుసంధానంగా నిలవాలని నిర్ణయించుకున్నట్లు కన్వీనర్ కపిలేశ్వరయ్య తెలిపారు. 10 సంవత్సరాల గడచిన కాలంలో ప్రభుత్వాలు హైకోర్టు బెంచ్, హైకోర్టు ఏర్పాటు చేస్తామంటే విశ్వసించామని, కానీ అది జరగలేదని, మరోమారు అలాంటి పరిస్థితి రాకుండా చూసేందుకే తమ సాధన సమితి పని చేస్తుందని ఆయన చెప్పారు. ఇప్పటికే ఈ విషయంపై జిల్లా జడ్జిని కలిసామని, త్వరలోనే అమరావతికి వెళ్లి పోర్టు ఫోలియో జడ్జిని కలుస్తామని ఆయన చెప్పారు. అలాగే హైకోర్టు జడ్జిలుగా పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి (డోన్), హరినాథరెడ్డి (నందికొట్కూరు), హరిహరనాథశర్మ (కర్నూలు)లను కలుస్తామని, వారి అంగీకారంతో త్వరలోనే వారిని కర్నూలులో సన్మానించే కార్యక్రమాన్ని చేస్తామని ఆయన చెప్పారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అయ్యేంతవరకు తాము విశ్రమించమని ఆయన చెప్పారు.

## ప్రైవేట్ వాహనానికి ప్రభుత్వ డ్రైవర్లా?

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుందన్నది నిబంధన. అయితే, కెఎంసిలో దీనికి పాతర వేశారు. ఆరోగ్యశాఖాధికారి వినియోగిస్తున్న ప్రైవేట్ వాహనానికి కెఎంసి డ్రైవర్లను ఉపయోగిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా రెండేళ్లుగా ఇలానే వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ వాహనానికి యజమానికి మాత్రం డ్రైవర్‌ను కలుపుకుని డబ్బు చెల్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆరోగ్య శాఖ ప్రైవేట్ విభాగానికి ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న డ్రైవర్ విష్ణువర్ధన్‌గౌడ్, ఆరోగ్య విభాగంలో హెవీ వాహనానికి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న శివ అనే వ్యక్తులు ఆ ప్రైవేట్ వాహనానికి డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు ప్రైవేట్ డ్రైవర్‌కు నిబంధనల పేరుతో జీతాలు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తోండగా, కెఎంసి డ్రైవర్లను ఉపయోగించుకోవడమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రైవేట్ వ్యక్తికి ప్రభుత్వం నెలకు 10 నుండి 15వేల రూపాయల జీతం ఇవ్వాలన్న నిబంధన ఉంది. అయితే ఆరోగ్యాధికారి ప్రైవేట్ వాహనానికి సంస్థకు చెందిన డ్రైవర్లు విధులు నిర్వహిస్తే ఆ వాహన డ్రైవర్‌కు ఇచ్చే జీతం ఎవరు తీసుకుంటున్నట్లని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆరోగ్యాశాఖాధికారి రెండేళ్లుగా ఈ ప్రైవేట్ వాహనాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఈ లెక్కలు తేలిస్తే రెండేళ్ల పాటు ప్రైవేట్ డ్రైవర్‌కు ఇచ్చే జీతం కెఎంసికి మిగులుతోందా? లేక ఎవరైనా జేబులు నింపుకుంటున్నారా? అన్న అనుమానాలున్నాయి.

## మురికి కాలువలో పసికందు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలో మురికి కాలువలో పసికందును వేసిన సంఘటన పలువురికి కలిచివేసింది. తొమ్మిది నెలలు మోసిన తల్లి తన కసాయితనంతో మురుగు కాలువలో వేసిన సంఘటన పలువురికి కంటతడి పెట్టించింది. కోవెలకుంట్లలోని వడ్డె వీధిలో ఈ సంఘటన శనివారం ఉదయం 11 గంటలకు వెలుగు చూసింది. కాలువలో శిశువు మృతదేహం ఉండటంతో కాలనీలోని కుక్కలు పసిగట్టి మృతదేహాన్ని వెలికి తీయడంతో చుట్టుపక్కల వారు గమనించి కుక్కలను తరిమికొట్టారు. వెంటనే శిశువును ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంత దారుణమైన సంఘటన గతంలో సంతపేటలో జరుగగా నేడు వడ్డె వీధిలో వెలుగు చూసింది. ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేశారు. దీనిపై కోవెలకుంట్ల పోలీసులు కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా కని పడవేసారా లేక చనిపోయిన శిశువును అక్కడ వేశారా అనే కోణంలో ఎస్సై మల్లికార్జున్ రెడ్డి విచారణ జరుపుతున్నారు.

## చెత్త సేకరణకేంద్ర స్థలంలో పిచ్చి మొక్కలు తొలగింపు



**సి. బెళగల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో శనివారం సర్పంచ్ రామక్క ఆధ్వర్యంలో చెత్త సేకరణ షెడ్ స్థలంలో పిచ్చి మొక్కలు తొలగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిందెందుకు గ్రామాలు పరిశుభ్రంగా చెత్త రహిత గ్రామాలుగా మార్చేందుకు ప్రతి గ్రామ పంచాయయితీలో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశాయి. అందులో భాగంగా పోలకల్ గ్రామంలో చెత్త సేకరణ షెడ్ కోసం కేటాయించిన స్థలంలో జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలుతొలగించారు. షెడ్ స్థలంపరిశీలించిన ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డి ఈశ్వరయ్య స్వామి, పంచాయతీ సెక్రటరీ సునీల్‌రాణి, అమర్నాథ్ లు చెట్ల తొలగింపు పనులను పరిశీలించారు

# ఎస్సీ వర్గీకరణ అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

అంటరానితనాన్ని పాటించే మిత్రా ఏమి న్యాయం చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలన్న సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తప్పు పడుతున్నానని ఆయన చెప్పారు. దేశంలో ఇప్పటికీ అంటరానితనం కొనసాగుతోందని, దీనికి ముగింపు అవసరమని ఆయన అన్నారు. శనివారం కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో అంటరానితనం ఇంకా ఎక్కువగా ఉందని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు కారణమని ఆయన చెప్పారు.

రాయలసీమ కరవు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని చింతామోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కపూట కూడా కడుపు నిండని పేద జనం బిక్కచచ్చి బతుకుతున్నారని ఆయన చెప్పారు. సంగమేశ్వరంవద్ద తీగలవంతెన వల్ల రాయలసీమకు ఒరిగేదేమీ లేదని, అక్కడ బ్రిడ్జితో పాటు రిజర్వాయర్ నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.రాయలసీమ నుండి ముఖ్యమంత్రులు వచ్చినా ఇక్కడి సమస్యలు మాత్రం తీరడం లేదని ఆయన చెప్పారు. రాయలసీమ కరవు నివారణపై దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు 50వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, మరో 50వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే గానీ అది ఉపయోగంలోకి రాదని చింతామోహన్ స్పష్టం చేశారు. అధికారపార్టీలు, కాంట్రాక్టర్లకు పోలవరం 'వరం'గా మారిందని ఆయన చెప్పారు. పోలవరం పేరు చెప్పి కోట్లాది రూపాయలు కొల్లగొట్టేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎడమ, కుడి కాలువల నిర్మాణం పూర్తి కాలేదని ఆయన చెప్పారు. వేగంగా పోలవరం నిర్మాణం పూర్తి చేయడంపై దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ఉన్న 2,500 ఎకరాలపై రాజకీయనేతల దృష్టి పడిందని, వాటిని స్వాధీనం చేసుకునేందుకే దాన్ని నిర్వీర్యం చేస్తున్నారని చింతామోహన్ ఆరోపించారు. వేల కోట్ల రూపాయల భూములను పొందేందుకు పథకం ప్రకారం పని జరుగుతోందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 11వేల కోట్ల రూపాయల ప్యాకేజీ విశాఖ ఉక్కును నష్టాల నుండి బయట పడేయలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేటీకరణ దిశగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిందని, విశాఖలో పర్యటించిన నరేంద్ర మోదీ తాము ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయబోమని ఎందుకు ప్రకటించలేకపోయారని ఆయన ప్రశ్నించారు.

కృష్ణా వరద జలాల్లో మునిగిపోయే ప్రాంతంలో రాష్ట్ర రాజధాని నిర్మాణం చేయడం సరైన నిర్ణయం కాదని చింతామోహన్ స్పష్టం చేశారు. 70వేల కోట్ల రూపాయల అప్పు తెచ్చి రాజధాని నిర్మాణం చేపడుతున్నారని, దీనికి వడ్డీలు తడిసి మోపెడు అవుతాయని ఆయన చెప్పారు. హడ్కో, ప్రపంచబ్యాంకు, జపాన్ నుండి రుణాలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. సాంకేతికంగా ఎక్కడున్నా పాలన నిర్వహించే అవకాశం ఉండగా, వేల కోట్ల రూపాయలు అప్పు చేసి భవనాలు కడతామని చెప్పడమేమిటని ఆయన నిలదీశారు. జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులంటే, చంద్రబాబు అమరావతి అంటున్నారని ఆయన చెప్పారు. దావోస్ పర్యటనతో పెట్టుబడులు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. దావోస్ పేరుతో ప్రభుత్వం షో చేసిందని ఆయన విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినట్లుగా విభజిత ఏపికి పెట్టుబడులు సాధించడం అంత సులభం కాదని ఆయన అన్నారు. చంద్రబాబు మంచి పరిపాలనా దక్షుడైనా రాష్ట్రంలో ఏ వనరులున్నాయని పారిశ్రామికవేత్తలు ఇటు వైపు వస్తారని ఆయన ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు అశోకరత్నం పాల్గొన్నారు.

# భూములిచ్చిన రైతులకు మొండిచేయి

(మొదటి పేజీ తరువాయి)

ఈ వర్క్ షాప్‌కు కేంద్రం తన వంతుగా ఇప్పటికే 1200 కోట్ల రూపాయలు మంజూరు చేసి రాష్ట్రప్రభుత్వానికి ఆ నిధులు అందజేసినా రైతులకు పరిహారం అందడం లేదు. 2018లో 6వ అదనపు జిల్లా కోర్టు రైతులకు 38.72 లక్షల రూపాయలు ఇవ్వాలని ఆదేశిస్తే అప్పటి తెదేపా ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వమూ చెవిటి ప్రభుత్వంలా వ్యవహరించింది. మరోవైపు రిహాబిలిటేషన్ వర్క్ షాప్ పనులు కూడా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. పెద్ద వర్క్‌షాప్ తమ గ్రామాలకు సమీపంలో వస్తుండడంతో భూములు కోల్పోయి నష్టమైనా తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని భావించిన రైతులు రెండు వైపులా నష్టపోయారు. నష్టపరిహారం అందక, ఉద్యోగాలు రాక ఇప్పటికే 8 రైతు కుటుంబాల పెద్ద మానసిక ఆందోళనతో మృత్యువాత పడ్డారు. మరోవైపు ఇప్పటికైనా నష్టపరిహారం ఇప్పించకపోతే బలవన్మరణాలు తప్పవని రైతులు అంటున్నారు.

రిహాబిలిటేషన్ వర్క్‌షాప్‌కు భూములిచ్చి నష్టపోయిన రైతులంతా న్యాయం కోసం రైతుల పోరాట కమిటీని ఏర్పాటు చేసుకుని పోరాటానికి దిగేందుకు సిద్ధమయ్యారు. శనివారం కర్నూలులో వారి న్యాయవాదులు కె.కపిలేశ్వరయ్య, సుంకన్నలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీకి స్థలాన్నిచ్చిన రైతు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హైకోర్టు తీర్పును కూడా అమలు చేయని ప్రభుత్వంపై కంటెప్ట్ వేశామని, అలాగే ఆర్డీఓ, ఎల్ఏఓ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను అటాచ్‌మెంట్ చేస్తూ 6వ అడిషనల్ జిల్లా జడ్జ్ ఆదేశాలిచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేపో మాపో ఫర్నీచర్‌ను వేలం వేస్తారని ఆయన చెప్పారు. మహిళా రైతులు బి.విజయలక్ష్మీ, టి.శేషమ్మ, బి.పద్మావతిలు మాట్లాడుతూ ఎకరాల 2 కోట్ల రూపాయల విలువ చేసే తమ భూములకు 6లక్షల ధర నిర్ణయించి అవార్డు చేశారని, దీన్ని వ్యతిరేకిస్తూ తాము న్యాయం కోసం సివిల్ కోర్టుకు వెళితే కోర్టు తమకు అనుకూలంగా తీర్పు చెప్పిందని, అయినా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు ప్రకారం తమకు ఎకరాకు 38.72 లక్షల రూపాయలను వడ్డీ, ఇతర బెనిఫిట్స్‌తో వెంటనే ఇవ్వాలని రైతులు లింగన్న, బి.పుల్లన్న, బి.సునీత, బి.పద్మ తదితరులు డిమాండ్ చేశారు.

న్యాయవాదులు కె.కపిలేశ్వరయ్య, సుంకన్న మాట్లాడుతూ రైల్వే కోచ్ మిడ్ లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్ షాప్‌కు కర్నూలు జిల్లాలో 119.88 ఎకరాల భూమిని 50 మంది రైతుల నుండి సేకరించారని చెప్పారు. 2015, జనవరి 31వ తేదీనబ్రీఫ్ అవార్డ్ ప్రొసీడింగ్స్ ఇచ్చిన ఆర్డీఓ/ఎల్ఏఓలు అదే ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన భూసేకరణ పూర్తి చేసి రైతులకు ఎకరాకు 6,17,326 రూపాయలను వడ్డీ, ఇతర బెనిఫిట్స్ కలుపుకుని ఇచ్చారని, దీన్ని వ్యతిరేకించిన వారి తరఫున సివిల్ కోర్టు దావా వేశామని వివరించారు. రిజిస్టర్ పత్రాల ఆధారంగా వడ్డీ, ఇతర బెనిఫిట్స్ కలుపుకుని ఎకరాకు 38.72 లక్షల రూపాయలు ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందని వారు చెప్పారు. తీర్పుపై ఆర్డీఓ, ఎల్ఏఓలు హైకోర్టుకు వెళ్లారని, ప్రభుత్వ వాదనలు విన్న హైకోర్టు 6వ అదనపు జిల్లా జడ్జి నిర్ణయించిన నష్టపరిహారంలో 50శాతం, వడ్డీ, కోర్టు ఖర్చులు, ఇతర బెనిఫిట్స్‌ను 8 వారాల లోగా చెల్లించాలంటూ 2023, ఫిబ్రవరి 9వ తేదీన హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఇప్పటి వరకు హైకోర్టు తీర్పును కూడా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు అమలు చేయలేదని వారు వివరించారు. దీన్ని తాము హైకోర్టులో సవాల్ చేశామని, కంటెప్ట్ వేశామని వారు చెప్పారు. అలాగే 6వ అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన నష్టపరిహారం తమకు సరిపోదంటూ హైకోర్టులో అప్పీల్ చేశామని వారు చెప్పారు. చిన్న, సన్న కారు రైతులు తమ పొలాలను ప్రభుత్వానికి ఇచ్చి అర్థాకలితో అలమటిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీవనధారం కోల్పోయిన రైతు కుటుంబాలు వీధిన పడ్డాయని వారు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు రైతుల కడుపు బాధను గుర్తించి నష్టపరిహారం అందించాలని వారు కోరారు.

## బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డ్ ను అందుకున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చేతుల మీదుగా బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డ్ ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అందుకున్నారు. శనివారం విజయ వాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఈ అవార్డును అందుకున్నారు. బాపట్ల కలెక్టర్ గా 2024లో ఓటర్ల జాబితా తయారీ, సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తదితర అంశాల్లో సమర్థవంతంగా పని చేసినందుకు ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ను బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డ్ ను అందచేసింది.



# ఆటో ఢీకొని విద్యార్థిని మృతి



మృతి చెందిన విద్యార్థినీ (ఫైల్‌ఫోటో)

– నలుగురికీ గాయాలు – విద్యార్థిని మృతదేహానికి డిఈఓ నివాళులు
– కుటుంబానికి టీడీపీ నాయకుల పరామర్శ



మృతి చెందిన విద్యార్థినీ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్న టీడీపీ నాయకులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండలం చౌళహళ్ళి మెయిన్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థినీ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు, మాధవరం ఎస్.ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామానికి చెందిన గొర్రెల ఆంజనేయ (రోగెన్న) ఈరమ్మ కుమార్తె అనూష (15) అనే విద్యార్థినీ 10వ తరగతి చదువుతోంది. శనివారం ఉదయం సుంకేశ్వరి నుంచి విద్యా నగర్‌లోని ఎస్ఎంకెవి పాఠశాలకు బయల్దేరింది. మార్గమధ్యంలో చౌళహళ్ళి వద్ద మరో విద్యా ర్థినీ ఆటో ఎక్కిం చుకోవడం కోసం ఆటో ఆగింది. వెనుకనుంచి మ రో ఆటో వచ్చి గుద్దడంతో వి ద్యార్థులున్న ఆటో బోల్తా పడింది. అనూష అనే విద్యార్థినీకి తీవ్రంగా గాయాలు తగిలాయి. మరో నలుగురికి కూడ గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా, విద్యార్థినీ మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. అలాగే ఎస్.ఐ విజయ్ కుమార్‌సంఘటన స్థలాన్ని చేరుకొని విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు. ఈ విషయం తెలుసుకొన్న డిఈఓ శ్యామూల్ పాల్ ఎమ్మిగనూరు ప్రభు త్వ ఆసుపత్రి వద్ద చేరు కొని విద్యార్థినీ మృత దేహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ విద్యార్థినీ తల్లికి అంత్యక్రియల నిమిత్తం వ్యక్తిగతంగా రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేసి ఓదార్చారు. 10వ తరగతి పరీక్షలకు హాజరు కావాల్సిన విద్యార్థినీ ప్రమాదవశాత్తు మృతి చెందడం దూర దృష్టకరమైన పరిణామమని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తమ పిల్లలు చదువుకు నేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని చౌటుపల్లి, సుంకేశ్వరి గ్రామప్రజలు కోరారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

**విద్యార్థినీ మృత దేహానికి టీడీపీ ఇంచార్జీ సోదరులు నివాళులు :**

రోడ్డుప్రమాదంలో మృతి చెందిన అనూష మృత దేహానికి మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ సోదరులు రఘునాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అధైర్యపడొద్దని, అండగా ఉంటామన్నారు. విద్యార్థినీ మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు అందజేశారు.

## బైకును ఢీకొన్న కారు.. ఇద్దరికీ తీవ్ర గాయాలు





**పాములపాడు, మేజర్ న్యూస్ :** కర్నూలు గుంటూరు ప్రధాన రహదారిపై కారు బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి సంఘటన శనివారం మండల కేంద్రం లో జరిగింది వివరాల్లోకి వెళ్తే విజయవాడ నుండి కర్నూలుకు వెళ్తున్న ఏపీ 21 బిఎం9888 నెంబరు గల కారు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని వెనకవైపు నుండి ఢీకొనింది ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్తున్న మౌలాలి చిన్న వెంకటేశ్వరరావు తీవ్ర గాయాలయ్యాయి 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ బాబు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## మరణానంతరం.. బాడీ డొనేషన్‌కు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన దంపతులు



అభినందించిన కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. కె. చిట్టి నరసమ్మ.

**కర్నూలు, మేజర్ న్యూస్ :** మరణానంతరం మృత దేహాలను వైద్య విద్యార్థుల పరిశోధన ల కోసం ఇవ్వాలని దంపతులు నిర్ణయం తీసుకున్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం యనగండ్ల గ్రామములో నివాసం ఉంటున్న దినేష్, శకుంతల దంపతులు వారి మరణాంతరం తమ మృత దేహాలను వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం కర్నూల్ మెడికల్ కళాశాల వారు ఉపయోగించుకోవచ్చని తమ అంగీకార పత్రాన్ని శనివారం కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛందంగా బాడీ డొనేషన్ కు ముందుకు రావడం గొప్ప విషయం అని వారిని అభినందించారు. బాడీ డొనేషన్ అన్నది ఒక గొప్ప కార్యక్రమమని వ్యక్తుల మరణాంతరం వారి,కుటుంబ సభ్యులు అంగీకారము తోనే ఆ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

– అగ్రి స్టాక్ ప్రాజెక్ట్ అమలు– మండల వ్యవసాయ అధికారి



రిజిస్ట్రేషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సిబ్బందికి ఫార్మస్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిటిజలైజేషన్ చేయాలన్న సంకల్పంతో దేశ వ్యాప్తంగా చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. పంటలు సాగు చేసే ప్రతి రైతు 14 అంకెల రిజిస్ట్రేషన్ నెంబరు పొందాలని తెలిపారు. వాటి కొరకు రైతు కేంద్రం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులకు లాగిన్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 26 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ యూనిక్ కోడ్‌తో రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ప్రభుత్వ సబ్సీడిలు, రుణాలు, పంటల భీమా, తదితర పథకాలకు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్, మొబైల్ నెంబర్‌తో అగ్రిస్టాక్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఎరువుల సరఫరా, కిసాన్ క్రెడిట్ ద్వారా లోన్ లింకేజ్‌లు, ఇతర సౌకర్యాలకు రైతు విశిష్ట సంఖ్య ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

– డ్రైవర్ కంసాలి శివ కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటాం...
– టీటీడీ పాలక మండలి సభ్యులు సీతారామిరెడ్డి



మృతి చెందిన కుటుంబాలను పరామర్శిస్తున్న టీడీపీ మాజీ పాలక మండలి సభ్యులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు శివారులో బుధవారం మంత్రాలయం నుంచి హంపి వెళ్తున్న తుఫాన్ క్రూజర్ వాహనం చక్రం యాక్సిల్ కట్ అయి మూడు పల్టీలు కొట్టడంతో వేద పాఠశాల విద్యార్థులు ముగ్గురు, డ్రైవర్ కంసాలి శివ మృతి చెందగా పలువురు విద్యార్థులు గాయపడిన విషయం పాఠకులకు విధితమే. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుజయీంద్ర, కంసాలి శివ కుటుంబాలను టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సీతారామిరెడ్డి శనివారం పరామర్శించారు. ముందుగా సుజయీంద్ర ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సహాయం కింద రూ. 10 వేల నగదును అందజేసి ధైర్యంగా ఉండాలని ఎల్లప్పుడు మా కుటుంబం, మా నాయకులు మీకు తోడుగా ఉంటారని అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. మండల కేంద్రంలోని రాఘవేంద్ర నగర్‌లో నివాసముంటున్న డ్రైవర్ సంగమేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సీతారామిరెడ్డి మృతుడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తక్షణ సహాయం కింద రూ. 5వేల నగదును అందజేశారు. వైఎస్సార్సిపి మండల అధ్యక్షులు భీమారెడ్డి, మండల ఇంచార్జీ సి.వి. విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటీసీ సభ్యులు వెంకటేష్ శెట్టి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఓటరు దినోత్సవం



తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ అధికారులు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** జాతీయ ఓటరు దినోత్సవంను రెవెన్యూ అధికారులు శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటి తహశీల్దార్ పెద్దన్న విఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బందిచే జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ ప్రజాస్వామ్య భారత దేశంలో ప్రతి పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలని అన్నారు. అనంతరం వారందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే అనుమతులు రద్దు



ఎరువుల దుఖాణం రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ ఆంజనేయ, ఏఓ విష్ణువర్ధన్ రెడ్డిలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఎరువుల, పురుగుల మందు దుఖాణ దారులు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకే విక్రయిస్తే అలాంటి దుఖా ణాల అనుమతులను రద్దు చేస్తామని వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ హెచ్చరించారు. శనివా రం ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని జిఎంఆర్ ఆగ్రోస్ ట్రేడర్స్, మధు ట్రేడర్స్, వసుంధర ఫర్టిలైజర్ దుఖాణాలను ఎడిఎ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. 97 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎరువుల దుఖాణ దారులు యూరియా కావాలంటే మరో ఏదైన ఎరువులు కొనాలని ఆంక్షలు విధించడం, అధిక ధరలకు విక్రయించడం లాంటివి చేయరాదన్నారు. నిబంధనల ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే అలాంటి దుఖాణాలపై చర్యలు తీసుకోని లైసెన్స్‌లు ర ద్దు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బంది కలకుండా అడిగిన ఎరువులు ఇవ్వాలని దుఖాణ దారులకు ఆదేశించారు.

## జాతీయ ఓటర్ల దినోత్సవం




ఓటర్ల దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ ఎంవి సుబ్రహ్మణ్యం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల సమీపంలోని రసుల్లపేట, వడ్డుగండ్ల గ్రామాల్లో ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్థానికులతో కలిసి 18సంవత్సరాల వయస్సు కలిగిన వారందరూ సంబంధిత కార్యాలయంలో ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తద్వారా తమ ఓటును సక్రమంగా వినియోగించు కోవాలని తెలిపారు. సరైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించడంలో ప్రతి ఒక్కరు కీలకంగా వ్యవహరించాలని విద్యార్థులు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

# లోపించిన..సమయపాలన

## వెనుదిరిగిన పశు యజమానులు

- మధ్యాహ్నం 12:30గంటలకే పశుఆరోగ్య శిబిరం మూత
- వెటర్నరీ ఆరోగ్య సిబ్బంది, వైద్యులపై ప్రజల ఆగ్రహం



**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలోని మూగజీవాలకు సరైన చికిత్సలు అందించేందుకు, అంటు వ్యాధుల నుండి వాటిని కాపాడేందుకు, సరైన సమయంలో నట్టల నివారణ మందులు వేసేందుకు, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని వాటికి వైద్య పరీక్షలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పశు ఆరోగ్య వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది. అయితే అందుకు విరుద్ధంగా సంబందిత పశుఆరోగ్య వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పశువులకు వైద్య పరీక్షల కోసం వచ్చిన యజమానులకు నిరాశే ఎదురైందనే చెప్పాలి. శుక్రవారం మండల పరిధిలోని నేరేడుచెర్ల, కొమ్మెమర్రి, మెట్టుపల్లి గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఏడి కిషోర్‌కుమార్ మెట్టుపల్లి గ్రామంలో అంకాలమ్మ కట్టవద్ద ఏర్పాటు చేసిన పశుఆరోగ్య వైద్య శిబిరంలో పాల్గొని రోగాల భారిన పడిన పశువులకు తమ సిబ్బంది సహకారంతో చికిత్సలు అందించి, మధ్యాహ్నం 12:30గంటలకు మరో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిభిరానికి వెళ్ళిపోయారు. అయితే మెట్టుపల్లి గ్రామంలోని వెటర్నరీ వైద్య సిబ్బంది మాత్రం వారి పై అధికారి కాస్త అటు వెళ్ళగానే ఇటు సదరు సిబ్బందిపై శిభిరాన్ని చుట్టేశారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న పశువులను తీసుకొని వైద్య శిబిరానికి వచ్చిన పశు యజమానులకు అక్కడ సిబ్బంది లేకపోవడంతో విస్తుపోయారు. దీంతో చేసేదేమిలేక పశువులను వెనక్కి పిలుచుకొని వెళ్లిపోయారు. సదరు విషయంపై సూర్య ప్రతినిధి మెట్టుపల్లె గ్రామంలోని అంకాలమ్మ కట్ట వద్ద జరిగిన పశుఆరోగ్య వైద్య శిబిరాన్ని మద్యాహ్నం 12:30గంటలకు క్లోజ్ చేసి వెళ్ళిన విషయంపై ఏడి కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా తమ సిబ్బంది భోజనానికి వెళ్ళినట్లు అనే సమాధానం రావడం ఆయన ఇచ్చిన సమాధానికి పొంతన లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖచ్చితంగా ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 3:00 గంటల వరకు గ్రామాల్లో ఉండి వైద్యసేవలు అందిం చాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే 12:30 గంటల కు ఎందుకు క్లోజ్ చేశారన్న విషయాన్ని సూర్య ప్రతినిధి ప్రస్తావించగా సాయంకాలం తమ సిబ్బంది గ్రామాలకు వెళ్ళి కోళ్ళకు టీకాలు వేస్తారంటూ దాటవేశారు.

**ఎప్పుడు వస్తారో.. ఎక్కడికి వెళ్తారో..**
**గ్రామప్రజల ఆగ్రహం :**

ఇప్పుడు జరుగుతున్న పశువైద్య ఆరోగ్య శిబిరాలకే కాదు అస్సలు వారు గ్రామాలకు ఎప్పుడు వస్తారో...ఎక్కడికి వెళ్తారో ఎవ్వరికి తెలియదని, ఎప్పుడు చూడు పశువైద్యశాలలకు తాళం వేసి ఉంటాయని, దీంతో పశువులకు తీవ్ర అస్వస్థతకు గురైన సమయంలో మండల కేంద్రానికి గాని, ఇంటి వైద్యం గాని చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని గ్రామాల ప్రజలు, పశువుల యజమానులు ఆరోపిస్తున్నారు. సరైన సమయానికి రాకపోగా, వచ్చిన సమయంలో



**పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులు వేస్తున్న వెటర్నరీ వైద్యులు**

కూడా పశువులకు సరైన వైద్యం అందించడంలో కూడా సిబ్బంది పూర్తి నిర్లక్ష్యంగా వవ్యహరిస్తూ, విధు ల దుర్వినియోగం చేస్తున్నారంటూ ప్రజలు మండిప డుతున్నారు. కావున జిల్లా పశువైద్యాధికారులు సైతం కాస్త దృష్టి సారించి పశువులకు సరైన సమయంలో వైద్యం అందేలా చర్య లు తీసుకోవాలని పశువుల యజమానులు, ప్రజలు కోరుతున్నారు.

# యువకుడి ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు

- సూసైడ్ లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్ళిపోయిన నిరంజన్ వలి
- ఉమ్మడి జిల్లాల పరిధిలో జల్లెడపడుతున్న పోలీసులు
- సిసి కెమెరాలు, డ్రోన్‌లతో గాలింపు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆన్‌లైన్ బెట్టింగ్‌లో అధిక నగదును పోగొట్టుకున్నాను, మీకు చెప్పలేక ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్నానని నీరంజన్ వలి రాసిన సూసైడ్ లెటర్‌తో పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే ఆత్మకూరు పట్టణం కొత్తపేటకు చెందిన నీరంజన్ వలి అనే యువకుడు బజాజ్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన యువకుడు రూ. 13లక్షలు పోగొట్టుకున్నానని, మీకు ముఖం చూపించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాను, నా చావుకు ఎవ్వరూ కారణం కాదంటూ సూసైడ్ లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. తన బైక్‌ను రఘునాథ్ సెంటర్‌లోని ఓ హోటల్ వద్ద పెట్టి 24వ తేది సాయంత్రం వెళ్ళిపోయాడు. సూసైడ్ లెటర్ చూసిన తండ్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలను చేపట్టారు. యువకుడి ఆచూకీ కోసం ఐదు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేస్తున్నారు. కర్నూలు పరిధిలో ఒక బృందం, నంద్యాల పరిధిలో రెండవ బృందం, వెంకటాపురం, బైర్లూటి అటవీ ప్రాంతంలో మూడవ బృందం, కరివేన, పాములపాడు కెనాల్ వెంట 4వ బృందం, డ్రోన్ కెమెరాలతో సిద్దాపురం చెరువు, అటవీ ప్రాంతం, వెలుగోడు రిజర్వాయర్, స్మృతివనం అటవీ ప్రాంతంలో ఐదవ బృందం గాలింపు చేపట్టారు. శనివారం సాయంత్రం వరకు కూడా యువకుడి ఆచూకీ లభించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఏది ఏమైన యువకుడి సూసైడ్ లేఖ కలకలం రేపుతుంది.

# పెళ్ళి ఇష్టంలేక యువతి ఆత్మహత్య

**డోన్, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో వట్టివెల్ల రజిత(20) అనే యువతి తల్లిదండ్రులు ఇష్టంలేని పెళ్ళి చేస్తారన్న ఉద్దేశ్యంతో, జీవితంపై విరక్తి చెంది గ్రామ పరిసరాలలోని పీతిరి వంక వద్దగల వేప చెట్టుకు చీరెతో ఉరివేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందు కున్న రూరల్ ఎస్సై మమత ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



**మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై మమత**

# పిల్లర్లు వేశారు.. నిర్మాణం వదిలేశారు..



**పాఠశాల వెనుకభాగాన నిలిచిపోయిన ప్రహరిగోడ నిర్మాణ పనులు**



**మెట్టుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలకు సంబందించి పాఠశాల చుట్టూ ప్రహరిగోడలను నిర్మించి, విద్యార్థులను విష సర్పాల నుండి రక్షించడం జరుగుతుంది. అలాగే పాఠశాలలో అసాంఘీక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ప్రహరిగోడ అడ్డుగా ఉంటుంది. అయితే మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చుట్టూ ప్రహరి గోడను నిర్మించేందుకు సదరు కాంట్రాక్టర్లు పునాది వేసి, పిల్లర్లు వేశారే గాని, పాఠశాల వెనకభాగాన మాత్రం ప్రహరి గోడను నిర్మించకుండా వదిలేయడంతో పాఠశాల ప్రాంగణంలోకి విషసర్పాలు వస్తున్నాయి. వాటితో పాటు ఆకతాయిలు సైతం మద్యం సేవించడానికి, తదితర అసాంఘీక కార్యకలాపాలకు పాఠశాల అడ్డాగా మారిపోయింది. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఆకతాయిలు మద్యం సేవించి, మద్యం సీసాలను అక్కడే వేయడంతో ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు వాటిని తొలగించడం విచారకరం. కావున ప్రభుత్వ పాఠశాలకు వెనుకభాగాన అసంపూర్తిగా గోడను నిర్మించి వదిలేసిన చోటు నుండి తిరిగి ప్రహారిగోడను నిర్మించి పనులను సంపూర్ణం చేయాలని గ్రామప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

# చదువుతోనే బంగారు భవిష్యత్తు – సివిల్ జడ్జి

**కోసిగి మేజర్ న్యూస్:** ప్రతి ఒక్కరు చదుతోనే ఉన్నతమైన స్థానాల్లో ఉండాలంటూ చదువే ముఖ్యమని ఆదోని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతీయ మహిళాకమీషన్, జాతీయన్యాయసేవ అధికారి సేవా ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోసిగి మండలం అక్షరాస్యతలో పూర్తిగా వెనుకబడిందన్నారు. అక్షరాస్యత లేకపోవడం వల్ల బాల్యవివాహాలు, మహిళలు చదుకోకపోవడం వంటివి జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు మేల్కోని మహిళలను చదివించాలని వారు సూచించారు. బాల్యావివాహాలు చేయడం వల్ల నష్టాలను, కష్టాలను తెలియజేశారు. అలాగే చదువుతోనే ప్రతి ఒక్కరికి బంగారు బవిష్యత్తు ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జక్కనిగేని వెంకటేశులు, అర్చన, యస్ఐ చంద్రమోహన్, సిడిపిఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.




**సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని జడ్జి**

# మహిళలు ప్రత్యేక చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



**తుగ్గలి,మేజర్ న్యూస్:** మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ జూనియర్ సివిల్ ఇంచార్జి జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి తెలిపారు. శనివారం ఎంపీడీవో సమావేశ భవనంలో పత్తికొండ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ప్యానల్ అడ్వకేట్ సురాజ్ నబి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పత్తికొండ జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళల్లో మార్పు రావాలని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత మహిళలు బాగా చదువుకుని తమ కాళ్ళమీద తాము నిలబడాలని తెలిపారు. భారత రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చిందని సూచించారు. అన్యాయం జరిగినప్పుడు మహిళలు వెంటనే పోలీస్ స్టేషన్ ఆశ్రయించాలని, అక్కడ న్యాయం జరగకపోతే స్థానిక కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థలో అధికారులను సంప్రదించాలని తెలిపారు. డబ్బులు పెట్టి అడ్వకేట్లను పెట్టుకోలేని సమక్షంలో ఒక తెల్ల పేపర్ మీద రాసి ఇస్తే మండల న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచితంగా న్యాయం పొందవచ్చని సూచించారు. అలాగే తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో విశ్వమోహన్, సీనియర్ న్యాయవాది కాశీ విశ్వనాథ్, ఎస్సై కృష్ణమూర్తి, సిడిపిఒ లలిత లు మాట్లాడారు. తదనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుండి వచ్చిన కిట్లను మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నాగరాజు, వెలుగు ఏపీఎం రాధాకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుమిత్రమ్మ, అంబిక, నాగేశ్వరమ్మ, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది రాఘవేంద్ర, ప్రసాద్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో ఖాజీపూర సమస్యలపై దృష్టి



మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు, కాలనీ వాసులు

**ఆదోని, మేజర్ న్యూస్ :** 14వ వార్డు ఖాజీపూర కాలనీ వాసులు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి సమస్యలను విన్నవించారు. ఈ విషయాన్ని స్పందించిన ఎమ్మెల్యే, బిజెపి నాయకుడు మదుసూదన శర్మ ఖాజీపూర కాలనీకి వెళ్లి సమస్యలను గుర్తించి మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయమని ఆదేశించడంతో అక్కడున్న డ్రైనేజీ, రోడ్లు, శానిటేషన్, సమస్యలు చాలా అధ్వాన్న స్థితిలో ఉన్న విషయాలను గుర్తించి కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కమీషనర్ కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, తాహేర్ బాషా, ఇబ్రహీం, వలి, ముస్లీం మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుంది



రాష్ట్రస్థాయి ఉత్తమ ఎలక్ట్రోరల్ అవార్డు అందుకుంటున్న నంద్యాల జిల్లా కలెక్టర్

**డోన్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుందని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం మార్కెట్‌యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకాలు చేపట్టిన 24 గంటల్లో రైతుల ఖాతాలలో జమ చేయడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా రైతులకు న్యాయం జరగడం సంతోషం వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పట్ల నిర్లక్ష్యం వహించారన్నారు. అదే కూటమి ప్రభుత్వంలో డోన్ నియోజకవర్గంలో కంది పంటలు పండించిన రైతులకు క్వింటానికి రూ.7,550లు గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని కమలాపురం గ్రామ సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి సొంత నిధులతో పేదల కొరకు ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ చేతుల మీదుగా అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ప్రజలు ఈ ఉచిత అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి విజయభట్, డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రాజా నారాయణమూర్తి, నాయకులు కోట్రికే ఫణిరాజ్, బీజేపి నాయకులు వడ్డె మహరాజ్, సందు రమణ, జనసేన నాయకులు బ్రహ్మం, మార్క్‌ఫెడ్ అధికారులు హరినాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు సిబ్బంది కొచ్చెర్వు రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఎలక్ట్రోరల్ అవార్డు ప్రధానం



రాష్ట్రస్థాయి ఉత్తమ ఎలక్ట్రోరల్ అవార్డు అందుకుంటున్న నంద్యాల జిల్లా కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** 2024వ సంవత్సరంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ప్రస్తుత నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ రాష్ట్ర స్థాయి అవార్డును, ప్రశంసా పత్రాన్ని బహుకరించారు. శనివారం అమరావతిలో నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో అవార్డును ప్రధానం చేశారు. 2024 సాధారణ ఎన్నికలలో అత్యుత్తమ విధులు నిర్వహించిన గుంటూరు జిల్లా అప్పటి జాయింట్ కలెక్టర్, మంగళగిరి రిటర్నింగ్ అధికారి ప్రస్తుత జిల్లా కలెక్టర్ రాజకుమారికి ఉత్తమ అవార్డు అందుకోవడంపై నంద్యాల కలెక్టరేట్ అధికారులు అభినందనలు తెలిపారు.

# 350 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

## – గురురాజాలో రన్‌ఫర్ రిపబ్లిక్ డే ఉత్సవాలు



350 అడుగుల జాతీయ జెండాను ర్యాలీగా వెళ్తున్న దృశ్యం




మాట్లాడుతున్న ఎస్డీపీఓ మందజావళి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీగురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ రిపబ్లిక్ డే కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి విద్యార్థులకు నింపేలా గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి పర్యవేక్షణలో రన్ ఫర్ రిపబ్లిక్ డే ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో 350 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా నంద్యాల ఎస్డీఓపి మంద జావళి ఆల్ఫోన్స్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, నంద్యాల సీఐలు ఇస్మాయిల్, మల్లికార్జున గుప్త హాజరయ్యారు. ఈసందర్భంగా జావళి మాట్లాడుతూ విద్యార్థులకు స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో ఉద్యమ భావాన్ని నింపేందుకు శ్రీగురురాజా పాఠశాల యాజమాన్యం నిర్వహించిన రన్ ఫర్ రిపబ్లిక్ డే కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఆనందాన్ని కలిగించిందన్నారు. విద్యార్థి దశ నుంచే రహదారి నిబంధనలు పాటించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని గుర్తు చేశారు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు రహదారి నిబంధనలపై అవగాహన కలిగించాలన్నారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ గురురాజ పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించడంలో ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ రన్ ఫర్ రిపబ్లిక్ డే కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ర్యాలీ నంద్యాల టెక్కె మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై పద్మావతినగర్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది.

# టాటా లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో టాటా లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో సంకల్ప అవగాహన సదస్సు బైక్ ర్యాలీని ఇన్సూరెన్స్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాటా లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ మహేష్ ఆధ్వర్యంలో టాటా లైఫ్ ఇన్సూరెన్స్ వ్యవస్థాపకులు రత్నం టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ టాటా లైఫ్ ఇన్సూరెన్స్ సంకల్ప ముఖ్య ఉద్దేశ్యం కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. ఇన్సూరెన్స్ కుటుంబానికి భరోసా, బలం, నమ్మకం ఉంటుందనే విషయంపై సంకల్ప బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్

# ఓటు హక్కు అమూల్యమైనది



ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది లాంటిదని ఆర్ఐ అంకన్న పేర్కొన్నారు. జాతీయ ఓటు దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వో, వీఆర్‌వోలు కలిసి ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ అంకన్న మాట్లాడుతూ ఓటు యొక్క విలువ బాధ్యతా యుతంగా ఓటును వినియోగించడం, ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఐదేళ్ళకు ఒక్కసారి జరిగే ఎన్నికల్లో ప్రజల ఓటు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటంలో ఓటు ప్రాముఖ్యత ఎనలేనిదని అన్నారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పౌరుడు ఎన్నికల సమయంలో తప్పని సరిగా తమ హక్కును వినియోగించుకోవాలని, అలాంటి వారికే ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు వెంకటేశ్వరరెడ్డి, ప్రదీప్, వీఆర్‌వోలు దాదాసాహెబ్, గోపాల్ నాయుడు, చిన్న దస్తగిరి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సూర్య

ఆదివారం | 26 జనవరి 2025

# హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి..డి.ఎస్.పి ప్రమోద్



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మోటార్ సైకిల్ పై ప్రయాణించేవారు ఇరువురు హెల్మెట్ తప్పని సరిగా వాడాలని ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా డి.ఎస్.పి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నంద్యాల బ్రేక్ ఇన్స్పెక్టర్ రవిశంకర్,ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్లోని పోలీస్ సిబ్బందితో కలిసిడీఎస్పీ కార్యాలయం నుండి హెల్మెట్లు ధరించి పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కోర్టు మీదుగా నాలుగు గుడ్ల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ఆవశ్యకతప్రమాదాల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. అనంతరం హెల్మెట్ లేని వారికి హెల్మెట్లు అందజేశారు. ఈ ర్యాలీలో ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన శవాసప్ప తాత స్వామి ఉరుసు



దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

**తుగ్గలి,మేజర్న్యూస్:**మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో శనివారము శవసప్ప తాత స్వామి ఉరుసు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. చెన్నంపల్లి గ్రామ సమీపంలోనే ఎంతో చరిత్ర గల కోట వద్ద కొన్ని సంవత్సరాల నుండి శవసప్ప తాత ఉరుసు ను భక్తులు నిర్వహిస్తూ ఉన్నారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం వేలాది మంది భక్తులు శవసప్ప తాత స్వామి దర్గాను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులు దర్గా ఆవరణంలో కందూరు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు నబి రసూల్, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్, సర్పంచ్ సలహాదారుడు వెంకటపతి, నీటి సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు మాభాష,రాజేంద్రగౌడ్, అక్బర్ బాషా, రామయ్య ,కోటేష్ గౌడు, వైఎస్ఆర్సిపి నాయకులు వెంకటరామిరెడ్డి, రాళ్ల కుట్టించే సుంకన్న, రంజాన్, అలాగే ఏపీఎస్పీ ఎస్సై ఆలీ భాష, గ్రామ ప్రజలు తదితరులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భ ంగా దర్గా నిర్వాహకుడు హుస్సేన్ పీరా భక్తులకు కావలసిన మౌలిక వసతులను ఏర్పాటు చేశారు.

**నేషనల్ హైవే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులను అడ్డుకున్న**

# సిపిఎం పార్టీ నాయకులు గ్రామ ప్రజలు

**సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్**



**పాములపాడు ,మేజర్ న్యూస్ :** పాములపాడు చెలిమెల్ల గ్రామాల మధ్యన నేషనల్ హైవే అండర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి శనివారం సిపిఎం నాయకులు చెలిమిల్ల గ్రామ ప్రజలు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అడ్డు చెబుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 అడుగుల నిర్మాణం జరుగుతుందని కోత మిషన్లు మరియు పెద్ద వాహనాలు వస్తే ఇబ్బందిగా ఉంటుందని అదే కాకుండా ఇదే రహదారిలో కొత్తపల్లె మండలం దాదాపు 21 గ్రామాలకు వెళ్లే మార్గమని అందుకే ఇంకా అయిదు అడుగులు మేర పెంచాలని కోరారు సంఘటన స్థలానికి పిఎస్కె కంపెనీ యాజమాన్యం పుట్ట సుధాకర్ అక్కడికి చేరుకున్నారు నిర్మాణం పనులు అడ్డుకున్న వారితో మాట్లాడుతూ ఇక్కడ అడ్డుకుంటే ఏమీ రాదని నేషనల్ హైవే పిడి తో మాట్లాడాలని సూచించారు బ్రిడ్జి నిర్మాణం లో మార్పులు ఉండవని సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే ఉన్నత అధికారులతో మాట్లాడాలని పనులు అడ్డుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెలిమిళ్ళ సర్పంచ్ కోట్ల చంద్రారెడ్డి, కో ఆప్షన్ నెంబర్ ముర్తుజా అలీ, మైనార్టీనాయకులు, మొహమ్మద్ అనీఫ్, అన్వర్, సిపిఎం పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, రాజు రామ్మూర్తి రంగస్వామి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని బనగానపల్లె ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్ కుమార్ రెడ్డి శనివారంనాడు బనగానపల్లె మండల పరిధిలోని పలుకూరు సచివాలయం నందు ఓటరు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటి ప్రాధాన్యత, ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు. అలాగే ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలోని సచివాలయ సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో రోడ్లు , డ్రైనేజి వ్యవస్థ గురించి గ్రామంలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డిని కాటసాని శివ నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కళ్ల వెంకటరమణ రెడ్డి**



**కల్లూరు,మేజర్ న్యూస్ :**పాణ్యం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన కళ్ల వెంకటరమణ రెడ్డి (రైతువిభాగంఅధ్యక్షులు),దుర్గా ప్రసాద్ (యూత్ వింగ్ అధ్యక్షులు), మాచ వెంకట సాయికృష్ణ, (పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు). శనివారం నంద్యాల జిల్లా అధ్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్రెడ్డిని పాణ్యం యువనాయకులు కాటసాని శివ నరసింహ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. అనంతరం వారితో మాట్లాడుతూ పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు వస్తాయి.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ కార్పొరేటర్లు అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

**పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి బిసి,మాజీ సర్పంచ్ రాజారెడ్డి**




పోస్టరును ఆవిష్కరిస్తున్న మంత్రి బిసి జనార్ధన్రెడ్డి




పోస్టరును ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచ్ బిసి.రాజారెడ్డి

**బనగానపల్లె, మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఆలయానికి సంబంధించిమహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను రాష్ట్ర మంత్రి బిసి.జనార్ధన్రెడ్డి బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఆవిష్కరించారు. ఆలయ ఈవో చంద్రుడు, టిడిపి నాయకుడు మౌలిశ్వర్రెడ్డి,పాతపాడు సర్పంచ్మహేశ్వర్రెడ్డి, ప్రధాన అర్చకులు మహేష్ స్వామిల ఆధ్వర్యంలో శనివారం రాత్రి బిసి రాజారెడ్డి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఫిబ్రవరి 25వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే వేలాదిమంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో చంద్రుడికి బిసి రాజారెడ్డి సూచించారు. బ్రహ్మోత్స వాలకు చేస్తున్న ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యానికి లోను కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మీరాపురం నారాయణ రెడ్డి, పాతపాడు శంకేశ్వర్రెడ్డి, సాధుకొట్టంరామశేఖర్,మనోజ్,జోలపురం తిరుమలయ్య పాల్గొన్నారు.

# నజీర్.. నోరు అదుపులో పెట్టుకో..!

- వైసీపీ హయాంలో నువ్వు చేసిన దోపిడీలు, అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు
- పోలీసులను దూషించడం వల్లనే వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు
- అభివృద్ధి గురించే తప్ప.. ఎవరి మాటలనో వినాల్సిన అవసరం, తీరిక బీవీకి లేదు ..
- ఎమ్మెల్యే బీవీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదు
- వైసీపీ నాయకులకు టిడిపి నాయకుల వార్నింగ్



మాట్లాడుతున్న టీడీపి నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** వైసీపీ పార్టీ ఐదేళ్ల అధికార కాలంలో ఎమ్మిగనూరు పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ చేసిన దోపిడీలు, అరాచకాలను ఎమ్మిగనూరు ప్రాంత ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఎమ్మిగనూరు అభివృద్దే ధ్యేయంగా నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నావు. నజీర్ అహ్మద్ నీ నోరు అదుపులో పెట్టుకో..అంటూ వైసీపీ నాయకుడు నజీర్ అహ్మద్ పై టీడీపి నాయకులు దామా నరసింహులు, ఖాసీం వలి, కలీముల్లా, బందే నవాజ్, ఇషాక్, జహంగీర్ బాషా, గట్టు అల్తాఫ్, ధర్మపురం గోపాల్లు తీవ్రంగా మండిపడ్డారు. ఎస్ఐ నాయక్ కు సంబంధించిన కేసులో టిడిపి పార్టీపై, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిపై శనివారం వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. చట్టం అందరికీ సమానమేనని, ఎవరికీ చుట్టం కాదు తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ఆ తర్వాత ఆయన తనయుడు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిలకు ప్రజల సంక్షేమం, ఎమ్మిగనూరును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. గత 40 ఏళ్లుగా ఎమ్మిగనూరు ప్రజలకు నిస్వార్ధ సేవలు అందిస్తున్నారే తప్ప, బీవీ కుటుంబం ఏనాడు ప్రతీకారం కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. టౌన్ ఎస్ఐని దూషించిన కేసులో వైసీపీ నాయకులపై చట్ట ప్రకారమే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అందుకు సంబంధించిన వీడియోలో ఆధారాలు ఉన్నాయన్నారు. పోలీసు అధికారులను ఇష్టానుసారంగా గౌరవం లేకుండా మాట్లాడడంవల్లనే కేసులు నమోదైనట్లు తెలిపారు. అంతేతప్ప దీనికి తెలుగుదేశం పార్టీకి ఎమ్మెల్యేకు సంబంధమే లేదన్నారు. గతంలో చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో ఇక్కడి టీడీపి నాయకులు ధర్నాలు చేసిన సమయంలో అక్రమంగా కేసులు పెట్టిన సంగతిని మరచిపోయారా అని ప్రశ్నించారు. షాడో లేదు.. సూడో లేదు కేవలం అభివృద్ధి గురించి మాత్రమే ఆయన సలహాలు అభిప్రాయాలు తీసుకుంటారే తప్ప ఇతరుల సలహాలు సూచనలు తీసుకోవాల్సిన అవసరం మా నాయకుడు బీవీకి లేదని టిడిపి నాయకులు తేల్చి చెప్పారు. తండ్రి బీవీ మోహన్ రెడ్డి బాటలోనే తనయుడు ఎమ్మెల్యే బీవీ కూడా అభివృద్ధి బాటలో ముందుకు వెళ్తున్నారేగానీ ఇలాంటి కక్ష సాధింపు చర్యలను మీలాగా ఆయన ఏనాడూ ప్రోత్సహించలేదని వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితే ఉంటే బాధితుల నుంచి వస్తున్న ఆరోపణల ప్రకారమైతే మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ పై ప్రతిరోజు కేసులు పెట్టేవారన్నారు. నజీర్ అహమ్మద్ ఎన్ని పాపాలు, దౌర్జన్యాలు చేసినా కూడా మా ఎమ్మెల్యే బీవీ దయ, దాక్షిణ్యాల వల్లనే ఇంకా సరైన చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్ఐ డాక్టర్ నాయక్ కు టిడిపి పార్టీ తరపున మద్దతును తెలియజేస్తున్నాం. వైసీపీ నాయకులపై నమోదైన కేసులకు తెలుగుదేశం పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని వారు హితవు పలికారు. ఎమ్మెల్యే బీవీపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని టిడిపి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిన్నప్ప, కేటీ వెంకటేష్, షాలేము, నారాయణ, నర్సప్ప, జిక్రియ, టీడీపి నాయకులు పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం





**-ఓటు పాధాన్యత పై ర్యాలీ ప్రదర్శించిన అధికారులు**

**-వృద్ధ ఓటర్లకు సన్మానం..**

**-గ్రామీణ ఓటర్లకు మరింత అవగాహన అవసరం**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయం నుండి ఇంచార్జి తహసీల్దార్ పురుషోతమ్ముడు ఆధ్వర్యములో మండల ఎంపీడీఓ రాణెమ్మ వివిధ శాఖల అధికారులు బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా బయలుదేరి మంహారంగా ఏర్పాడి ఓటు యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పుడు నుండి మన రాజ్యాంగం పౌరులందరికీ అర్హత, మతం, కులం,జాతి,వివక్షత లేకుండా సమాన ఓటు హక్కు కల్పించిందన్నారు. ప్రజాస్వామ్యం ఆరోగ్య కరమైన పనితీరుకు ఓటు హక్కు అత్యంత ప్రధానమైనదిగా పరిగణించ బడుతుందన్నారు,ఇది పౌరులందరి నుండి ముఖ్యంగా యువత ఓటు హక్కును చిత్త శుద్ధితో వినియోగించు కొవలన్నారు. ఇది ప్రజాస్వామ్య పండుగ ను సాఫీగా సమ్మిలితంగా సురక్షితంగా ఎటువంటి ప్రభావం లేకుండా చేయడానికి మా సమిష్టి ప్రయత్నలను భాగస్వామ్యపరుస్తుందని బలమైన శక్తి వంతమైన ప్రజాస్వామ్యం కోసం ఎన్నికలను పవిత్రమైనదిగా ఇతరులకు ఆదర్శంగా మారుస్తుందని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అదికారులు, మండల ప్రజా పరిషత్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కంబద హాల్ గ్రామంలో ఓటర్ సత్యరెడ్డిని గ్రామ ఉపాధ్యాయులు అధికారులు సన్మానిచి ఓటు పై చిత్తశుద్ధి చాటుకున్నారు.

# రైతుల గుండెల్లో గుబులు రేపుతున్న పొగ మంచు



**తన పొలంలో కురుస్తున్న పొగమంచును చూపుతున్న రైతు**

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** ఆరుగాలం కష్టించి పొలాల్లో పనిచేస్తే కానీ పట్టడన్న రైతుకు దొరకని ఈ రోజుల్లో గత నాలుగు రోజుల నుండి పొగమంచు రూపంలో రైతుల గుండెలను గుబులు రేపుతుంది.వరుసగా నాలుగు రోజులుగా రబీలో వేసిన పైర్లను పొగ మంచు రూపంలో పంటలను చీడ, పురుగు, తెగుళ్ల పట్టిపీడిస్తుంటే రైతు కంట కన్నీరు వస్తుందంటే అతిశయోక్తి కాదు. ఖరీఫ్ లో అధికవర్షాల వల్లఅడపాదడపా వచ్చినపంట దిగుబడితో పొలాలను సాగు చేసుకుని రబీలో వచ్చిన పంటతో మొక్కజొన్న, మినుము, తెల్ల నువ్వులు, పెసర, వరి, కొర్ర, సజ్జ, శనగ పంటలను సాగు చేసి వాటిని తెగుళ్ల బారిన పడకుండా రైతు అప్పో సప్పో, లేక దంపతులు ఆభరణాలనుపెట్టి సాగు చేసుకొని దిగుబడి ఆశాజనకంగా వస్తే, పెట్టుబడి అంతా పోను ఎంతో కొంత మిగులుతే అప్పులు తీర్చుకుందాం అనే ఆశతో ఉన్న రైతుకు నాలుగు రోజులుగా కురుస్తున్న పొగ మంచు వేసిన పైర్లపై పడి తెగుళ్ల విరివిగా రావడంతో, ఎన్ని మందులు పిచికారి చేసినా తెగులు తగ్గకపోవడం వల్ల, రైతులు ఆందోళన గురవుతాల్సి వస్తుంది. ఈ పొగ మంచు పంట పొలాల పైనే అధికంగా కురవడం వల్ల తెగులు తగ్గకుండా ఉన్నాయని వాటి నివారించేందుకు రైతు అష్ట,కష్టాలు పడవలసి వస్తుందన్నారు. ఈ మంచు కురిచిన గంటలోపే రైతు వేలకు వేలు వెచ్చించి పురుగు మందులు పిచికారి చేసిన మళ్లీ మరుసటి రోజు 7 గంటల నుండి 10 గంటల వరకు భూమి కనబడకుండానే కురుస్తూ ఉంటే రైతు గుండెల్లో గుబులు మొదలవుతుంది. ఇప్పటికీ నెల రోజులు నుండి 40 రోజులు కావచ్చునా కొన్ని పైర్లకు పూత కాయలు పడాల్సి ఉంది. ఈ పొగ మనసు వల్ల వచ్చే పూత మొత్తం రాలిపోవడమే కాకుండా పురుగు, తెగుళ్ల అధికమవుతున్నాయి. అరీపులో వర్షాల వల్ల నష్టపోవడం జరిగిందని, ఆ నష్టాన్ని కాస్త రబీ లోనైనా పుర్చుకుందామనే ఆశతో ఉన్న రైతుకు వరుసగా కురుస్తున్న పొగమంచు శాపంగా మారింది అంటే అతిశయోక్తి కాదు. ఈ పొగ మనసు బారినుండి తప్పించుకోవాలంటే రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తే ఆదరణ ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము పొగ మంచు వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి బీమా వర్తించేలా చూడాలని పలు రైతులు కోరుచున్నారు.

**పొటాషియం నైట్రేట్ మందును పిచికారి చేయాలి :వ్యవసాయ అధికారి :**పొగ మంచు బారి నుండి పూత రాలకుండా ఉండేందుకు పొటాషియం నైట్రేట్ అనే మందును పిచికారి చేస్తే పూత దశలో ఉన్న పైర్లు కొంతవరకు పూత రాలకుండా కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి రంగా నేతాజీ తెలిపారు. కావున రైతులు రబీలో సాగు చేసే పైర్లకు పొగ మంచు కురిసిన వెంటనే 13 -0 -45 అనే పొటాషియం నైట్రేట్ మందును పిచికారి చేయాలని వివరణ ఇచ్చారు.



**వ్యవసాయ అధికారి రంగా నేతాజీ**

# గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పూర్తి






**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.నగరంలోనిపోలీస్ పెరేడ్ మైదానంలో దేశభక్తి ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఆదివారంఉదయం 9 గంటలకు పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు సాయుధ దళాల పెరేడ్ పరిశీలన చేసి, పోలీసు సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరిస్తారు. గణతంత్ర దినోత్సవ ప్రసంగం వినిపిస్తారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను



కలిసి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. జిల్లాలోని ప్రధాన చెందిన షకటాలును అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాల బహూకరణ చేస్తారు. అలాగే ప్రభుత్వ పథకాల స్టాల్స్ సందర్శనతదితరకార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పెరేడ్ మైదానంలో అన్ని విధాల ఏర్పాట్లు చేపట్టారు. నగరంలోని పలు కూడళ్లలో విద్యుత్ దీపాలంకరణ చేసారు.నగరంలోని చారిత్రక కట్టడాలను విద్యుత్ దీపాలతో ఆలంకరించారు.

## వాహనాలు నడవే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** రోడ్డుపై వాహనాలను నడిపి సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ కుమార్ డ్రైవర్లకు సూచించారు. స్థానిక కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణంలో కళాశాల ప్రిన్సిపల్ మల్లేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాల సందర్భంగా డ్రైవర్లకు, క్లీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి.ఎస్.పి ప్రమోద్ కుమార్, నంద్యాల బ్రేక్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రోడ్డుపై వానలు నడిపి సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే ప్రజలను కూడా సురక్షితంగా చేర్చాలని ఆటో డ్రైవర్లతో అన్నారు. ఆటో డ్రైవర్లు వారి పేర్లు సెల్ నెంబర్లు ఆటో వెనుక రాయించుకోవాలన్నారు. బ్రేక్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం డిఎస్పి ప్రమోద్ కుమార్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె వి సుబ్బారెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబన్న, డ్రైవర్లు క్లీనర్లు పాల్గొన్నారు.

## యువతీ యువకులు ఓటు హక్కు జన్మ హక్కుగా పాటించండి



**ఓటు హక్కు పై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం**

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** 18 సంవత్సరాలు దాటిన యువతి యువకులందరూ తమ ఓటు కోసంనమోదుచేసుకొని ఈ ఓటు హక్కును జన్మ హక్కుగా భావించాలని డిప్యూటీ తహసిల్దార్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ ఓటు హక్కు దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుండి గాంధీ సెంటర్ వరకు ర్యాలీగా చేరుకొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సత్తార్, వీఆర్వో ప్రసాద్, విజయ లక్ష్మి, సచివాలయ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది ఉన్నారు

## మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన డీఈవో

**కర్నూలు స్పోర్ట్స్ మేజర్ న్యూస్:** కర్నూలులోని ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం జిల్లావిద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అనే విషయాల ను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలో ప్రభుత్వ రూపొందించిన మెనూని తప్పకుండా అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ కాకుండా విద్యార్థులకు వేరే మెనూ ప్రకారం భోజనం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



**విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ**

## ఉద్యోగాలకు ఎంపికైన యువకులకు నియామక పత్రాల



**కల్లూరు మేజర్ న్యూస్ :** మెగా జాబ్ మేళా సందర్భంగా ఇంటర్వ్యూలలో 1400 మంది యువకులు,యువతులు హాజరు అయ్యారు. అమర్ రాజా కంపెనీ కి 800 మంది,మెడ్ ప్లస్ కంపెనీకి 200 మంది హాజరు కాగా50 మంది యువకులు పలు రకాల ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరందరికీ ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయిన వారికి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి, ఉమ్మడి జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి, పాణ్యం నియోజకవర్గం యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి అపాయింట్మెంట్ లెటర్‌లుఅందజేశారు. కార్యక్రమంలో మార్కెట్యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి నాయకులు ప్రభాకర్ యాదవ్ ఉలిందకొండ రమణ తదితరులు పాల్గొన్నారు.

## గోనెగండ్లలో ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఆలూరు మండలం అరికెర గ్రామాంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యకు నిరసనగా మండల కేంద్రమైన గోనెగండ్లలో శనివారం ఉపాధిహామీ సిబ్బంది ఎంపీడీవో కార్యలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మణి మంజరి, ఈవోఆర్డీ అనంతశయన. ఎంపీవో మహుమ్మద్ బాషా, ఈసీ ఉస్మాన్లతో పాటు పలు గ్రామాల ఫీల్అసిస్టెంట్ల లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను దారుణంగా హత్య చేయడం అమానవీయచర్య అని వారు అన్నారు. హత్య చేసిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



## హైకోర్టు స్టే ఉన్నదాన్ని ప్రారంభించడం కోర్టు ధిక్కారం



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల సాయి బాబా నగర్‌లోని మజీద్‌ఏ కుబ్రా, ఈద్గా కబరస్తాన్ డెవలప్ మెంట్ సొసైటీ కోర్టు స్టేలో ఉండగా మంత్రి ఎన్ఎండీ ఫ రూక్ శంకుస్థాపన చేయడం కోర్టు దిక్కారం క్రిందికి వస్తుందని సొసైటీ అధ్యక్షుడు మహబూబ్ ఖాన్ విలేఖరు లకు తెలిపారు. గతంలో సొసైటీ అధ్యక్షుడి వ్యవహార శైలి, దౌర్జన్యాలు, ఆగడాలను ప్రస్తుత మంత్రి సమక్షంలో నే అంజద్‌బాష సిద్ధికి, కరీముల్లలను సొసైటీ నుంచి తొల గించడం జరిగిందని అన్నారు. గతంలో వీరితో గొడవలై స్టేషన్లల్లో పలుమార్లు కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని అన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా 2023 స్టేటస్‌కో ఇవ్వడం జరిగిందని అన్నారు. కోర్టులో ఉన్నదాన్ని మంత్రి శంకుస్థాపన చేయడం సరైనది కాదని అన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే : ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎంఎల్ఏ భూమా అఖిల ప్రియ అన్నారు. మండలంలోని ఓబులంపల్లె గ్రామం లో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే శని వారం ప్రారంభించారు. గ్రామానికి వచ్చి న ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు, ఎన్నారై గౌరు రామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆళ్లగడ్డ తాలూకాలోని ఓబులంపల్లి, యాదవా డ గ్రామాలలో సిసి రోడ్లు ప్రారంభిస్తుంటే చాలా సం తోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్క డా లేని అభివృద్ధి ఇప్పుడు జరుగుతుంటే ప్రజలకు ప్ర భుత్వంపై నమ్మకం కలుగుతుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాలనే ఉద్దేశంతో డిప్యూ టీ సీఎం పవన్ కళ్యాణ్ జాతీయ గ్రామీణ ఉపాధి హా మీ నిధులు ప్రతి మండలానికి రెండు కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. సరిపోవు అనే ఉద్దే శంతో పెంచాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయడం జరిగిందన్నారు. ఆళ్ల గడ్డ నియోజకవర్గానికి 240 పను లకు గాను రూ. 13.46 కోట్లు మం జూరు కాగా 211 పనులు పూర్తయ్యా యన్నారు. ఇంకా 29 పనులు మాత్ర మే పెండింగ్ లో ఉన్నాయని వంద శాతం పనులు పూర్తి చేస్తామన్నారు. బిల్లులు కొంత జాప్యం అయినా టిడిపి ప్రభుత్వంలో కచ్చితంగా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి పనులు చే యడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆళ్లగడ్డ ని యోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామన్నారు. నియోజక వర్గంలో ఇల్లు లేని వారికి ఇల్లు స్థలాలు ఇప్పిస్తామని అలాగే నిరు ద్యోగ యువతీ యువకులకు కచ్చితంగా ఉద్యోగ అవ కాశాలు వచ్చేలా చూసుకుంటామన్నారు. అనంతరం యాదవాడలో సీసీ రోడ్లను ప్రారంభిం చారు. ఈ కార్య క్రమంలో గౌరు రామకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ డిఇ వెంకటరెడ్డి, శంకరయ్య, కౌన్సిలర్ హుస్సేన్ భాష, ఆళ్లగడ్డ టిడిపి మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, చిన్న కందుకూరు మాధవరెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఓబులంపల్లెలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైంది




సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటు హక్కును ప్రతి ఓటరు సమర్ధవంతంగా సద్విని యోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఆర్వో రామునాయక్, నంద్యాల, ఆత్మకూరు, డోన్ రెవెన్యూ డివిజనల్ అధికారులు విశ్వనాథ్, నాగజ్యోతి, నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసామ్యంలో ఓటు అత్యంత విలువైనదని ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్ని మన దేశంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. 1947 సంవత్సరంలో మన దేశంలో పాటు ఆఫ్రికన్, ఏషియన్ దేశాలకు కూడా స్వాతంత్యం వచ్చినప్పటికీ భారతదేశంలో ఉన్న అతి పెద్ద ప్రజాస్వామ్యం ఏ దేశానికి లేదన్నారు. ఇలాంటి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో భారత ఎన్నికల సంఘం కృషి ప్రశంసనీయమన్నారు. భారతదేశ జనాభా 30కోట్లు అయినప్పటికీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా భారత ఎన్నికల సంఘం శాంతియుతంగా సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య దేశంగా నిల బెట్టిందన్నారు. బ్యాలెట్ పత్రాలకు బదులుగా ఈవీఎంలను ప్రవేశపెట్టి సటిష్టవంతంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ ఎన్నికలను నిర్వహిస్తోందని జేసీ తెలిపారు. 75సంవత్సరాల క్రితం భారత ఎన్నికల సంఘం స్థాపించబడి తనదైన శైలిలో మెరుగులు దిద్దుకుంటూ 99కోట్ల మంది ఓటర్లు ఉన్నప్పటికీ ప్రశాంతంగా ఎన్నికలు పూర్తిచేసి ప్రజాస్వామ్య ప్రతిష్టతకు దేశ పౌరులుగా గర్వపడాలన్నారు. అనంతరం యువ ఓటర్లకు, సీనియర్ సిటిజనులకు ఎపిక్‌కార్డులు పంపిణీ చేశారు. అంతకుముందు ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ఓటు హక్కుకు ఉన్న విలువను ఓటర్లు తెలుసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలందరిచేత జాతీయ ఓటర్ల ప్రతిజ్ఞను చేయించారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి బి.సి

**అవుకుమేజర్,న్యూస్:** అవుకు పట్టణం తేరు వీధిలో రూ. 32లక్షల ఎంజిఎన్ఆర్ ఈజి ఎస్, డిఎంఎఫ్ నిధులతో పూర్తి చేసిన నూ తన సిమెంట్ రోడ్డును రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీ బి.సి జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి నోచుకోక పూర్తిగా వెనుకబడిపో యాయని గుంతల రోడ్లతో ప్రజలు నరకం అనుభవించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సి.ఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తం గా రూ. 861 కోట్ల నిధులతో గుంతల రోడ్ల మరమ్మత్తుల కార్యక్రమం చేపట్టామని వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతా ల్లో , పట్టణల్లో అంతర్గత సీసీ రోడ్లకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభం తో సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికా రు. ఆలయంలో స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఐ.వి పక్కీరారెడ్డి, చల్లా విజయ్ కుమార్ రెడ్డి, మెట్ల రామిరెడ్డి, అవుకు టీడీపీ మం డల అద్యక్షుడు ఉగ్రసేనా రెడ్డి, టీడీపీ నాయ కులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, పరమేశ్వర రెడ్డి, వెంకట రమణ, కార్యకర్తలు ఆర్. డబ్ల్యు, ఈ డబ్ల్యుస్, పంచాయితీ అధికారు లు సిబ్బంది పాల్గొన్నారు.





### – అధికారులు ప్రజల సమస్యలపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి



మండల అధికారులు ప్రజల సమస్యలపట్ల అప్రమత్తంగా వ్యవహరించి ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం ద్వార ప్రజలకు సేవ చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి మండల అధికారులకు సూచించారు. శనివారం మండల అద్యక్షుడు చల్లా రాజశేఖర్ అద్యక్షతన అవుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని వివిధ శాఖల పనుల తీరుపై సమీక్షలు నిర్వహించారు. వారికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంగన్న, తహశీల్దార్ మల్లికార్జున రెడ్డి, పలువురు మండలస్థాయి అధికా రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను గురించి సమస్యల గురించి వైద్యాధికారి డాక్టర్ అభినయ్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు ఎటువంటి అవసరాలు ఉన్నా వైద్యశాలకు సంబం దించి ఎటువంటి సమస్యలు ఉన్నా తనకు తెలియజేయాలని తాను సహకరించగ లనని ఈ సందర్భంగా వైద్యాధికారులకు సిబ్బందికి ఆయన హామి ఇచ్చారు. అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రం కార్పోరేట్ వైద్యశాలలకు ధీటుగా పని చేస్తోందని ఈ సందర్భంగా వైద్యుల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు అనుభవంతోనే

# రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

### – మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసి ప్రకృతి సంపదను దోచుకుని వెళ్లి ఖాళీ ఖజానాను అప్పగిం చిన సైతాన్ వైసీపీ జగన్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, ఎంతో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వల్లే మళ్లీ రాష్ట్రం అభివృద్ధి పదంలో ముందుకు వెళ్తున్నదని సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ప్రజల నుంచి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వినతిపత్రాలు స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొందరు చిల్లర దొంగల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని ప్రజలు తమ సమస్యలు తెలుపుకొనేందుకు ప్రజా ప్రతినిధుల వద్దకు వస్తే వారికి సహాయం చేసేందుకు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు ఎంతో ఆశతో సీఎం చంద్రబాబుపై నమ్మకంతో అధికార ం ఇచ్చారని వారి ఆశలు వమ్ము చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి టీడీపీ ప్రజా ప్రతినిధి నాయకులు పనిచేయాలన్నారు. చంద్రబాబుకు అందరూ అండగా ఉండాలన్నారు.

# హత్యా రాజకీయాలు మంచి పద్ధతి కాదు..

### – అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యపై స్పందించిన ఎమ్మెల్యే

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి జిల్లాలో వైఎస్సార్సిపి నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా టీడీపీ నాయకులు దాడులు చేస్తూ, ఫ్యాక్షన్ పురుడు పోస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనా గిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం ఈరన్నను హత్య చేయడంపై ఆయన స్పందించి మీడియాతో మాట్లాడుతూ, ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడాలంటే 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్సిపి ప్రభుత్వం హయాంలో ఉంది. ఎక్కడ కూడ ఇలాంటి సాంప్రదాయాలను ప్రొత్సహించలేదు. ఉద్యోగాలు, పదవుల విష యాల్లో ఒక్కటికి రెండుసార్లు ఆలోచించి, మా ట్లాడి సామరస్యంగా సాధించుకోవాలేగాని ఇలా దాడులు, హత్యలు చేస్తూ, పోతే భవిష్య త్‌లో కూడ ఇదే పద్ధతి అనుసరించాల్సి వస్తుం ది. ఈరన్న హత్య కేసులో నింధితులను వెంట నే గుర్తించి అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మృతి చెందిన ఈరన్న కుటుంబానికి వైఎస్సార్సిపి ఎల్లప్పు డు తోడుగా ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే